
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 4 ఏప్రిల్ 2024 | 5





మనదే విక్టరీ కావాలి..

నీ కోసమే చూస్తున్నాం : రావులపాలెం జాతీయ రహదారిపై బాబుకు సాష్టాంగ నమస్కారం చేస్తున్న అభిమాని



ప్రజాగళమై : రావులపాలెం హైవేపై బాబు రోడ్‌షోకు వెల్లువెత్తిన అభిమానం



కురిసింది పూలవాన : మండపేట రోడ్‌షోలో నమస్కరిస్తున్న చంద్రబాబు



కూటమి అభ్యర్థులను గెలిపించండి : ద్రాక్షారామలో మాట్లాడుతున్న చంద్రబాబు



రావులపాలెంలో.. ద్రాక్షారామలో..

నేను మీ వాడిని..

మీరు వేసే ఓటు.. మీ భవిష్యత్‌కే..

- ప్రజాగళం సభలు సూపర్‌హిట్
- అండగా ఉంటానని బాబు హామీ
- రావులపాలెంలో జగ్గిరెడ్డిపై ఫైర్
- ద్రాక్షారామలో తోట, బోస్‌పై ఆగ్రహం
- అడుగడుగునా నీరాజనం
- సభ ప్రాంగణాలకు వెల్లువలా జనం
- కూటమిలో సమరోత్సాహం

కాకినాడ, అమలాపురం (ఆంధ్రజ్యోతి)/రావులపాలెం/ద్రాక్షారామ/ మండపేట, ఏప్రిల్ 3: జనం... జనమే జనం... అడుగడుగునా బ్రహ్మరథం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం సభకు జనం పోటెత్తారు. అధినేత ఆగమనం ఆలస్యం అయినా వేయి కళ్లతో ఎదురుచూశారు. వైసీపీ పాలనలో దగాపడ్డ తమకు చంద్రబాబు అధికారంలోకి వస్తే ఏంచేస్తారో చెబితే వినడానికి బారులు తీరారు. వచ్చిన జనాలను చూస్తుంటే తెలుగుదేశం అధికారంలోకి రావడం ఖాయంగా కనిపిస్తోందని ధీమా వ్యక్తంచేశారు. గోదావరి జిల్లా ప్రజలు మంచితనానికి మారుపేరంటూ కొనియాడారు. మంచినీళ్లు అడిగితే కొబ్బరి నీళ్లు ఇచ్చేంత మంచివారు అంటూ వేనోళ్ల పొడిగారు. పూతరేకులు తీయదనం ఇక్కడి ప్రజల మనసుల్లో ఉంటుందంటూ ఈ ప్రాంతంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం, రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామ ప్రజాగళం సభల్లో చంద్రబాబు ప్రసంగించారు. రావులపాలెంలో బుధవారం సాయంత్రం జరిగిన ప్రజాగళం తొలి బహిరంగ సభకు జనం పోటెత్తారు. చంద్రబాబు రాజమహేంద్రవరం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 4 గంటల సమయంలో మల్లయ్యదొడ్డిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకున్నారు. కూటమి శ్రేణులు చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి చంద్రబాబు సుమారు మూడు కిలోమీటర్ల రోడ్‌షో నిర్వహించారు. అక్కడ అభిమానులు ఏర్పాటు చేసిన భారీ గజమాలను క్రేన్ సాయంతో చంద్రబాబుకు అలంకరించారు. అనంతరం రావులపాలెం తెలుగుదేశం మండల పార్టీ కార్యాలయం వద్ద జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రావడం తథ్యమని, చంద్రబాబు పాలన కోసం రాష్ట్రం ఎదురుచూస్తోందన్నారు. నియోజకవర్గంలోని ఓటర్లు ఈ ఎన్నికల్లో డిపాజిట్లు రాకుండా జగ్గిరెడ్డి తరిమితరిమికొట్టి ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ ఏడు అసెంబ్లీ స్థానాలను గెలిచి చంద్రబాబు కానుకగా అందిస్తానని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. చంద్రబాబునాయుడు 50 నిమిషాలకుపైగా ప్రసంగించారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అవినీతి, అక్రమాలపై చంద్రబాబు మరోసారి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కోనసీమ ప్రజల గొప్పదనాన్ని గుర్తుచేస్తూ ఈ ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. అన్ని స్థానాల్లో టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కోనసీమ జిల్లాలో అధికార వైసీపీ అరాచకాలపై చంద్రబాబు ధ్వజమెత్తారు. ఇసుక దోపిడీ దగ్గర నుంచి మట్టి మాఫియా వరకు ఏకరువు పెట్టారు. మంత్రి వేణు చెల్లని కాసు అని మండిపడ్డారు. తన పదవిని కాపాడుకునేందుకు వైవీ సుబ్బారెడ్డి కాళ్లపై పడి బీసీల పరువు మంటగలిపారని ధ్వజమెత్తారు. నియోజకవర్గాన్ని అడ్డంగా దోచుకుతిన్నారని నిప్పులుకక్కారు.తీరా ఎన్నికల ముందు పక్క నియోజకవర్గానికి బదిలీ అయి వెళ్లిపోయారు. ఇక్కడున్న ఎంపీ బోస్‌పైనా చంద్రబాబు ధ్వజమెత్తారు. తోట త్రిమూర్తులు గురించి మాట్లాడుతూ ఇక్కడ ఉండే వ్యక్తి పక్క నియోజకవర్గానికి వెళ్లిపోయారు. దళితులకు శిరోముండనం చేసిన వ్యక్తి ఆయన అంటూ మండిపడ్డారు. జిల్లాలో దళితులను ఎందరినో వైసీపీ పొట్టనపెట్టుకుందని చంద్రబాబు నిప్పులు కక్కారు. కాకినాడలో తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్‌ను హత్య చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును పక్కన పెట్టుకున్న జగన్ దళితులను ఏం ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. ఆయనకు ఊరేగింపులు కూడా వైసీపీ నేతలు చేశారంటే ఎంత కండకావరం అని ప్రశ్నించారు.



రావులపాలెం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు



మన జెండా.. ఎన్నికల్లో ఇలా ఎగరాలి

కోటిపల్లి రైల్వేలైన్ పూర్తి చేస్తాం...

కోనసీమ జిల్లా అంటే బాలయోగి. ఈ ప్రాంతం కోసం ఆయన కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ సాధించారు. కానీ వైసీపీ వచ్చాక కేంద్రం ఇచ్చిన నిధులకు రాష్ట్రం తన వాటా నిధులు ఇవ్వకుండా ప్రాజెక్టును నీరుగార్చింది. అందుకే బాలయోగి కల నెరవేర్చేలా టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని చంద్రబాబు ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో ఓఎన్జీసీ పైపు లైను వల్ల మత్స్యకారులకు నెలకు రూ.11 వేల చెల్లింపును టీడీపీ వస్తే ఆపేస్తుందని వైసీపీ ప్రచారం చేస్తోంది. కానీ దీన్ని ఎవరూ నమ్మొద్దు. అవసరమైతే నష్టపరిహారం పెంచేలా చర్యలు చేపడతామన్నారు. గోదావరి కాలువల ఆధునికీకరణ, ఏటిగట్ల పటిష్టం చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని రహదారులను బాగు చేస్తామన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి చెందిందని ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రావులపాలెంలో ప్రసంగం పూర్తి చేసుకున్న చంద్రబాబు రోడ్డుమార్గంలో జొన్నాడ, ఆలమూరు, గుమ్మిలేరు, మండపేట, మాచవరం, పసలపూడి మీదుగా రామచంద్రపురం చేరుకున్నారు. అక్కడి నుంచి భారీ రోడ్డుషో నిర్వహిస్తూ సరిగ్గా రాత్రి 9.08 గంటలకు ద్రాక్షారామ చేరుకున్నారు. చంద్రబాబు తన ప్రసంగంలో రామచంద్రపురం అసెంబ్లీ అభ్యర్థి సుభాష్ మంచివాడని.. బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడతాడన్నారు. ఎంపీ అభ్యర్థి హరీష్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ నేతలు చంద్రబాబుకు నాగలి అందించారు. ముస్లింలు టోపీ అలంకరించారు. చంద్రబాబు రాత్రి పది గంటలకు రామచంద్రపురంలోని వీఎస్ఎం కాలేజీలో బసకు చేరుకున్నారు .గురువారం ఉదయం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేతలు, అభ్యర్థులతో సమీక్ష నిర్వహించనున్నారు. రావులపాలెంలో తొలుత హెలిపాడ్ వద్ద తెలుగు మహిళ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి చంద్రబాబుకు హరతిచ్చి స్వాగతం పలికారు.టీడీపీ నేతలు వేగుళ్ల జోగేశ్వరరావు, చిక్కాల రామచంద్రరావు, జనసేన పి.గన్నవరం అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, నాయకులు రేవు శ్రీను, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, టేకుమూడి సత్యనారాయణ, చిక్కాల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్రబాబు టూర్ ఇలా..

రాజమహేంద్రవరం ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబునాయుడు గురువారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో ప్రజాగళం యాత్రలు నిర్వహించనున్నారు. టీడీపీ-జనసేన- బీజేపీ కూటమిగా ఏర్పడి అభ్యర్థులను ఖరారు చేసిన తర్వాత తొలిసారిగా జిల్లాకు వస్తున్నారు. కొవ్వూరులో సాయంత్రం 4 గంటలకు, గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో 6 గంటల జరిగే ప్రజాగళం సభల్లో ప్రసంగిస్తారు. రాత్రికి నల్లజర్లలోని ప్రియాంక కన్వెన్షన్‌లో బస చేసి శుక్రవారం ఉదయం పార్టీ నేతలతో సమావేశమవుతారు.అనపర్తి సమస్యతోపాటు, జిల్లాలో అక్కడక్కడా ఉన్న అసంతృప్తి నేతలను బుజ్జగించే అవకాశం ఉంది. అనంతరం నరసాపురం వెళతారు.



నువ్వు రావాలయ్యా : ద్రాక్షారామం బహిరంగ సభలో జనం జేజేలు



బాబు వస్తారని : రామచంద్రపురంలో మహిళల వెయిటింగ్



దారంతా అభిమానమే : రావులపాలెంలో బాబు కోసం వచ్చిన మహిళలు



కదిలొచ్చిన పసుపు దండు : రావులపాలెంలో సభకు హాజరైన మహిళలు



ఇదీ మా స్పెషలండీ..ఆయ్ : చంద్రబాబుకు పూతరేకుల జ్ఞాపిక

రావులపాలెంలో చంద్రబాబు పర్యటన సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇసుక దోపిడీపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఆలోచింపజేసింది..



ప్రచారానికి అనుమతి తప్పనిసరి

జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 3: ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయపార్టీల అభ్యర్థులు వారి వారి ఎన్నికల ప్రచారానికి అవసరమైన అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే.మాధవీలత తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందన్నారు. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను అనుసరించి నామినేషన్ స్వీకరణ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రచార వ్యవధిలో అభ్యర్థి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) నియమనిబంధనలకు ఖచ్చితంగా కట్టుబడి ఉండాలన్నారు. ఇంటింటా ప్రచారం ప్రతిరోజు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే చేసుకోవాలన్నారు. సువిధా పోర్టల్‌లో సమగ్ర సమాచారం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 8 చెక్ పోస్టుల ద్వారా నిఘా పెట్టడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు సుమారు రూ. 78 లక్షలు విలువ కలిగిన వాటిని సీజ్ చేసినట్టు తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో నరసింహులు, రాజమండ్రి పార్లమెంట్ ఏఆర్‌వో ఆర్.కృష్ణ నాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాల విభజన జరిగి..
రెండేళ్లు.. 7



రాజమహేంద్రవరంలో ఒక సచివాలయం వద్ద పింఛన్లకు వేచిచూస్తున్న లబ్ధిదారులు

ఎంత కష్టం తెచ్చావయ్యా జగనా?

మధ్యాహ్నం వరకూ వృద్ధుల పడిగాపులు

రాజమహేంద్రవరం/ కొవ్వూరు, ఏప్రిల్ 3 : రాజు తలచుకుంటే డబ్బులకు కొదువా..ఇంతకాలం ఇచ్చింది.. ఈ ఒక్క నెలా ఇవ్వలేరా.. ప్రభుత్వంలో వ్యవస్థ అంటే ఒక్క వలంటీర్లేనా.. ఇంకేమీ లేవా.. గతంలో పింఛన్లు పంపిణీ చేసేవారు కాదా..!! అయితే జగన్ మాత్రం ఈ నెల పింఛన్ల పంపిణీలో ప్రజలను ఇబ్బందులు పాలు చేశారు. ఎన్నికల వేళ ఓటు రాజకీయానికి తెరలేపారు.సామాజిక పింఛన్లు పంపిణీకి సొమ్ము బ్యాంకు ఖాతాల్లో బుధవారం మధ్యాహ్నం 2 గంటల వరకు జమ కాలేదు. దీంతో పింఛన్లకు వచ్చిన లబ్ధిదారులు నిరాశగా వెనుదిరిగారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వ సంక్షేమ పథ కాల అమ లుకు వలంటీర్లను వినియోగించరాదని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఇంటింటికి పింఛన్లు పంపిణీకి సరిపడా వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నప్పటికి వైసీపీ ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో అధికారులు అలసత్వం చేశారు. ఇది ఎలాగైనా తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైసీపీ నాయకులు కుట్రపన్నారు. లబ్ధిదారులు సచివాలయాలకు వచ్చి పింఛన్లు తీసుకోవాలని మెలిక పెట్టారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదే అదునుగా వైసీపీ నాయకులు ప్రతిపక్షాలపై బురదచల్లాలని కుట్రలు పన్నుతున్నారు. ప్రతి నెల 31వ తేదీన పింఛన్ల సొమ్ము బ్యాంకుల్లో జమ అయ్యేది.ఏప్రిల్ నెలకు సంబంధించి 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ కాలేదు. 2 గంటల తరువాత సొమ్ము జమ చేయడంతో సచివాలయ సెక్రటరీలు డ్రా చేసుకోవడానికి బ్యాంకులకు తరలివెళ్లారు. మధ్యాహ్నం తరువాత బ్యాంకుల నుంచి సొమ్ము డ్రా చేసుకుని పింఛనుదారులకు పంపిణీ చేశారు. తొలిరోజు తూర్పుగోదావరి జిల్లాలో 39 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు సమాచారం.

జగన్నాటకం!
ఎన్నికల వేళ.. అధికార వైసీపీ రక్తికట్టించిన పింఛను డ్రామా 7



47 మంది వలంటీర్లు రాజీనామా

గోపాలపురం/నిడదవోలు, ఏప్రిల్ 3: వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. గోపాలపురం, కోమటిగుంట గ్రామాల్లో వలంటీర్లు బుధవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు పత్రాలను ఎంపీడీవో రమేష్‌కు బుధవారం సమర్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కోమటిగుంట, గోపాలపురం గ్రామాల్లో పని చేస్తున్న 34 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు చెప్పారు. నిడదవోలులో 13 మంది వలంటీర్లు కమిషనర్ రాం భూపాల్‌రెడ్డికి రాజీనామా పత్రాలను అందించారు. దీంతో బుధవారం ఒక్కరోజే 47 మంది రాజీనామా చేయడం గమనార్హం.

45 మందితో ప్రత్యేక పోలీస్ బృందాలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 45 మందితో మూడు స్పెషల్ పార్టీ పోలీసు బృందాలను ఎస్పీ జగదీశ్ ఏర్పాటు చేశారు. ఒక్కో టీంలో 15 మంది సిబ్బంది, 1 ఇన్‌చార్జి ఉంటారు. బుధవారం జరిగిన సమావేశంలో వారికి ఎస్పీ దిశానిర్దేశం చేసి యూనిఫాం కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు పి.అనిల్‌కుమార్, ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీలు డి.ప్రభాకరరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గోపాలపురంలో ఎంపీడీవోకు వలంటీర్ల రాజీనామా పత్రం

జగన్నాటకం

ప్రతిపక్షాలపై కుతంత్రం



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టార్గెట్ టీడీపీ.. ఇదే వైసీపీ పాలకులు అధికార దండం పట్టుకున్న నాటి నుంచీ సాగుతున్న రాజకీయ కక్ష కథా చిత్రమ్. సంఘటన ఏదైనా టీడీపీపై బురద జల్లడం ఒకటే అంతిమంగా జగన్ లక్ష్యం. ఈ జాడ్యం చివరికి అవ్వాతాతలను కూడా వదల్లేదు. వైసీపీ నాయకులు తమ రాజకీయ స్వలాభం, ఓట్లు రాబట్టుకోవడానికి నిబంధనలకు విరుద్ధంగా వలంటీర్లను వినియోగించడం తెలిసిందే. ఎన్నికల ప్రక్రియ మొదలు కావడంతో ప్రభుత్వ పథకాల పంపిణీకి వారిని ఎన్నికల సంఘం దూరం పెట్టింది. ఇది కచ్చితంగా పాలకులు చేసిన పాపమన్న విషయం జగద్విదితమే. అయితే దీనిని కూడా రాజకీయంగా తమకు అనుకూలంగా మలుచుకొని టీడీపీ బురద జల్లే రాజకీయ కుట్రకు జగన్ ప్రభుత్వం తెరతీసింది. ఉద్దేశపూర్వకంగానే పింఛను లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టి ఆ నెపం టీడీపీపైకి నెట్టేయాలనుకొంది. ఈ తంతులో భాగంగా పింఛన్ల పంపిణీని కావాలనే ఆలస్యం చేసింది. ప్రభుత్వ ఖజానాలో సొమ్ములు లేవన్న అసలు నిజాన్ని మాత్రం దాచిపెట్టింది. నిజాలను ఫ్యాను గాలితో ఆర్పేసే ప్రయత్నం చేసింది. అయితే పింఛన్ల పంపిణీ తొలి రోజు అయిన బుధవారం అసలు విషయం నిగ్గు తేలింది. ఏలికల కుట్ర తేటతెల్లమైంది.

- వైసీపీ పింఛను డ్రామా
- 'ఖాళీ' జేబును దాచిపెట్టి
- టీడీపీపై బురద జల్లే కుట్ర
- వృద్ధులతోనూ పాలకుల ఆటలు
- ప్రభుత్వం నుంచి డబ్బు రాకపోవడంతో
- సచివాలయాల వద్ద లబ్ధిదారులు పడిగాపులు
- ఉద్యోగులదీ అదే పరిస్థితి
- బుధవారం సాయంత్రానికి 'తూర్పు' 39 శాతం..
- కోనసీమ జిల్లాలో 24 శాతం..
- కాకినాడ జిల్లాలో 37 శాతం మందికి
- పింఛన్ల పంపిణీ
- సమాచారం లేక లబ్ధిదారుల ఇబ్బందులు

ఖాళీ జేబును దాచి..

పింఛన్ల పంపిణీ విషయంలో ప్రభుత్వం తన ఖాళీ జేబును దాచి పెట్టిందనే విషయం పింఛన్ల పంపిణీ తొలి రోజునే బయటపడింది. వాస్తవానికి ఐదేళ్ల నుంచీ ఆర్థిక క్రమ శిక్షణ గాడితప్పడంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. దీంతో తెల్లారగానే జోలి పట్టుకొని రుణాని కి పరుగులు పెట్టడం అలవాటుగా మారిపోయింది. ఏ పూట రుణం పుడితే ఆ పూట గడుపుతూ పాలన సాగిస్తున్నారు. చివరికి ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వడానికీ ప్రభుత్వం వద్ద పైసలు లేని పరిస్థితిని చూసి వైసీపీ పాలన తీసుకొచ్చిన గొప్ప సంస్కరణగా చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో మార్చి 16 నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలైంది. దీంతో ప్రభుత్వానికి అప్పులు పుట్టడం కష్టమైంది. ఆ విషయాన్ని దాచిపెట్టి ఆర్థిక సంవత్సరం చివరి రోజు, బ్యాంకులకు సెలవు, సర్వర్లు పనిచేయవు, సాంకేతిక కారణాలు అంటూ రకరకాల అవాస్తవాలను తెరపైకి తెచ్చారు. ఏప్రిల్ 1న పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వానికి ముందే తెలుసు కదా? మార్చి 31న యాన్యువల్ క్లోజింగ్ డే అని తెలియదా? సర్కారు ఖజానాలో సొమ్ము లేదు కాబట్టి ఏదోలా అబద్ధాలు వల్లె వేస్తూ ఏప్రిల్ 3 వరకూ పంపిణీ కార్యక్రమాన్ని నెట్టేశారు. మార్చి నెల చివరిలో వేల కోట్ల రూపాయలు వివిధ పనుల నిమిత్తం కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేసిన ప్రభుత్వం.. పింఛన్ల పంపిణీని మాత్రం వాయిదా వేయడం గమనార్హం.

అంతా జగన్మాయ..కావాలని చేసిన కుట్ర..?

సామాజిక పింఛన్ల పంపిణీని సైతం జగన్మాయ వీడలేదు. వలంటీర్లను జగన్ తన సొంత సైన్యం మాదిరిగా వినియోగించడంతో పారదర్శకంగా ఎన్నికల నిర్వహించ డంపై ఆ ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం పలు చర్యలు తీసుకొంది. వలంటీర్లను ప్రభుత్వ పథకాల పంపిణీకి అనుమతించలేదు. దీంతో వలంటీర్లను టీడీపీకి వ్యతిరేకం చేయాలనే కుట్రతో జగన్ ప్రభుత్వం మైండ్ గేమ్ ప్రారంభించింది. వలంటీర్లు అందుబాటులో లేకపోతే పింఛన్ల పంపిణీ ఇబ్బంది అవుతుందని నమ్మించే ప్రయత్నాలను మొదలు పెట్టింది. వాస్తవానికి సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ పంపించి పింఛన్లు పంపిణీ చేయించవచ్చు. కానీ ఏదో రకంగా టీడీపీపై పాపం నెట్టేయాలనే ఉద్దే శంతో లబ్ధిదారులను సచివాలయాలకు రావాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వారికి మిన హాయింపునిచ్చింది. గత ప్రభుత్వంలో మునిసి పాలిటీ, పంచాయతీ సిబ్బంది పింఛన్లు అందజేసేవారు. ఇప్పుడు సచివాలయ సిబ్బందికి వారిని జతచేస్తే సునాయాసంగా ఇళ్లకు తీసుకెళ్లి పింఛన్లు చేతిలో పెట్టవచ్చు. కానీ, ఆ దిశగా పాలకులు అసలు ఆలోచన చేయపోవడమే ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జగన్మాయలో భాగంగా పింఛనుదారులను మండుటెండలో సచివాలయాలకు రప్పించి.. ఇబ్బందులకు గురిచేసి.. టీడీపీని భూతంగా చూపించాలనే కుట్ర చేయడం విస్మయాన్ని కలిగిస్తోందంటూ ప్రజలు వాపోతున్నారు.

తొలిరోజున

తూర్పుగోదావరి జిల్లాలో తొలి రోజున అటు లబ్ధిదారులకు, ఇటు సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం నరకం చూపించింది. 3 నుంచి పింఛన్లు ఇస్తామనడంతో ఉదయం 6 గంటలకే లబ్ధిదారులు ఆదరాబాదరా సచివాలయాల వద్దకు చేరుకున్నారు. అయితే.. చాలాసేపు ఎదురు చూసినా ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవడంతో ఉసూరుమంటూ వెనుతిరిగారు. పింఛను సొమ్ములు సచివాలయ సిబ్బంది ఖాతాల్లో ఉదయం 11 గంటల నుంచి నెమ్మదిగా జమ కావడం ప్రారంభమైంది. కొద్దికొద్దిగా జమచేస్తూ వచ్చారు. దీంతో సచివాలయ సిబ్బంది బ్యాంకులకు వెళ్లి డ్రా చేసుకురావడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. రాజమహేంద్రవరం నగర పరిధిలోని ఓ సచివాలయ పరిధిలో 137 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారి నిమిత్తం సుమారు రూ.4 లక్షలు సచివాలయ సిబ్బంది ఖాతాలో జమ కావాల్సి ఉంది. అయితే 3న మధ్యాహ్నం 12 గంటల సమయానికి కేవలం రూ.35 వేలు మాత్రమే ప్రభుత్వం నుంచి జమ అయ్యాయి. ప్రతి చోటా ఇలాంటి ఇబ్బందినే ఎదుర్కొన్నారు. దఫదఫాలుగా ప్రభుత్వం జమ చేస్తుండడంతో సచివాలయ సిబ్బంది పరుగులు పెట్టాల్సి వచ్చింది. జిల్లాలో 2,44,730 మంది లబ్ధిదారుల నిమిత్తం సచివాలయ సిబ్బందికి రూ.72,66,98,500 జమ కావాల్సి ఉంది. కానీ బుధవారం సాయంత్రానికి సుమారు 50 శాతం సొమ్ములు అందినట్టు తెలుస్తోంది. అయితే కేవలం 20 శాతం లబ్ధిదారుల చేతికి మాత్రమే పింఛను అందింది. మిగతా వారికి 4, 5, 6 తేదీల్లో అందజేస్తామని అధికారులు చెబుతున్నారు.



సముద్రంలో వేటకు అంతరాయం

61 రోజుల పాటు సముద్ర జలాలలో చేపల వేట నిషేధం..

ఈ నెల 15 నుంచి అమలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 3 : ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది సముద్ర జలాలలో 61 రోజుల పాటు చేపల వేట నిషేధం అమలు కానుంది. ఇందుకు సంబంధించి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులపాటు సముద్ర జలాలలో యాంత్రిక పడవలు (మెకనైజ్డ్, మోటారు బోట్లు) ద్వారా అన్ని రకాల చేపల వేట సాగించరాదు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖ జీవో ఆర్‌టీ నెంబర్ 81లో పొందుపరిచింది. వివిధ చేప, రొయ్యల జాతులు సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం, తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించడం ముఖ్య ఉద్దేశ్యంగా సముద్ర జలాలలో చేపట వేట నిషేధం అమలు చేస్తున్నారు. ఈ నిషేధ ఉత్తర్వులను అనుసరించి సముద్ర జలాలలో యాంత్రిక పడవలు (మెకనైజ్డ్, మోటారు బోట్లు)పై మత్స్యకారులు ఎటువంటి చేపల వేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాల్సి ఉంది. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి చేపల వేట చేసిన బోట్ల యజమానులను ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1994 ,సెక్షన్ (4) ప్రకారం శిక్షార్హులు కానున్నారు. వారి బోట్లను, బోట్లలో ఉన్న మత్స్య సంపదను స్వాధీనం చేసుకుని జరిమానా విధించనున్నారు. అదే విధంగా ప్రభుత్వం అందించే డీజిల్ ఆయిల్ సబ్సిడీ, అన్ని రకాల సబ్సిడీ సౌకర్యాలను నిలుపుదల చేయనున్నారు. ఈ నిషేధ కాలాన్ని ఖచ్చితంగా అమలు చేసేందుకు మత్స్య శాఖ, కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేసింది. అందువల్ల మత్స్యకారులందరూ సముద్ర జలాలలో చేపల వేట నిషేధ కాలంలో సహకరించాలని రాష్ట్ర మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు కోరారు.

తళుక్కుమన్న శ్రద్ధాదాస్



రాజానగరం, ఏప్రిల్ 3: వనమాలి క్రియేషన్స్‌లో కంభంపాటి సంతోష్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న పారిజాత పర్వం మూవీ ప్రమోషన్‌లో చిత్ర యూనిట్ బుధవారం ఐఎస్‌టీఎస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సందడి చేసింది. హీరో చైతన్యరావు, హీరోయిన్ శ్రద్ధాదాస్ కళాశాలలో సందడి చేశారు. ఈ సందర్భంగా హీరో చైతన్యరావు మాట్లాడుతూ సస్పెన్స్ థ్రిల్లింగ్‌తో కిడ్నాప్ కథ నేపథ్యంలో అందరినీ అలరించేలా సినిమా రూపుదిద్దుకుందని చెప్పారు. హీరోయిన్ శ్రద్ధాదాస్ మాట్లాడుతూ గోదావరి అందాలు బాగున్నాయని, ఏప్రిల్ 19న సినిమా విడుదల కాబోతోందని కుటుంబ సమేతంగా సినిమా చూసి ఆదరించాలన్నారు. అనంతరం కళాశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థినులతో కలిసి క్రికెట్ ఆడారు. సినిమాలో సాంగ్స్‌కి డాన్స్ చేస్తూ, డైలాగ్స్ చెప్తూ అందరినీ అలరించారు. తొలుత కళాశాల చైర్మన్ కర్లెం ఉపేందర్‌రెడ్డి సినీ బృందానికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశ్రీరావు, వైస్ ప్రిన్సిపాల్ సూరిబాబు, ఏవో ఇక్బాల్, సిబ్బంది పాల్గొన్నారు.

9 గ్యారెంటీలతో కాంగ్రెస్ భరోసా

రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న గిడుగు రుద్రరాజు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 3: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 9 గ్యారెంటీలతో కాంగ్రెస్ పార్టీ భరోసా ఇస్తుందని ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీ కాటన్ హాలులో బుధవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. చారిత్రాత్మక రాజమహేంద్రవరానికి తాను కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే దేశం బాగుపడుతుందన్నారు. సీఎం జగన్ కేంద్రం అమలు చేసిన 18 ప్రజా వ్యతిరేక బిల్లులకు మద్దతుగా నిలిచాడన్నారు. ప్రత్యేక హోదా తీసుకురాలేక పోయాడని, పోలవరాన్ని పూర్తి చేయలేక పోయారని ధ్వజమెత్తారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకువస్తే దేశం రాష్ట్రం బాగుపడతాయన్నారు. తాను త్వరలోనే లోకల్ మేనిఫెస్టోను తయారు చేస్తానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, ఏఐసీసీ అబ్జర్వర్ మనోజ్‌చౌహాన్ ఎస్ఎన్ రాజా, జంగా గౌతమ్, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్, అరిగెల అరుణకుమారి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత..కేసు నమోదుకు సిఫార్సు



పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారులు

తుని రూరల్, ఏప్రిల్3: రేషన్ డీలర్, ఎండీయూ ఆపరేటర్ కుమ్మక్కై బ్లాక్ మార్కెట్‌కు పీడీఎస్ బియ్యం తరలించేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడ్డారు. విజిలెన్స్ అధికారులు పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టగా ఒక ఆటోలో పీడీఎస్ బియ్యం లోడు చేసి తరలించేందుకు సిద్ధంగా ఉండటాన్ని గమనించారు. దీంతో ఆటో డ్రైవర్‌ను ఆరా తీసి తనిఖీలు చేపట్టగా చేపూరు గ్రామానికి చెందిన రేషన్ షాపు నెంబరు 4కు హెల్పర్ అయిన కొత్తూరు నరసింహారావు సూచనల మేరకే బియ్యం లోడు చేసుకున్నట్లు డ్రైవర్ తెలిపారు. దీంతో సంబంధిత అధికారులు రేషన్‌షాపులో 4లో తనిఖీలు నిర్వహించగా అవకతవకలు బయటపడ్డాయి. విజిలెన్స్ అధికారుల విచారణలో రేషన్ డీలర్, ఎండీయూ ఆపరేటర్ పీడీఎస్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు తేల్చారు. 2650 కిలోల పీడీఎస్ బియ్యం, 87 కిలోల పంచదార, 6 కిలోల గోధుమలు సీజ్ చేసి రేషన్ డీలర్‌తో పాటు ఎండీయూ ఆపరేటర్, ఆటో డ్రైవర్‌లపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు చేసినట్లు విజిలెన్స్ అధికారి జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో విజయ్‌కుమార్, సీఎస్‌డీటీ విజయ్ కుమార్, జీవానంద శివ పాల్గొన్నారు.

ఓటేస్తూ సెల్ఫీలు దిగడం నిషిద్ధం

సామర్లకోట, ఏప్రిల్ 3: పోలింగ్ కేంద్రంలో ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో సెల్‌ఫోన్‌తో సెల్ఫీలు దిగడం లేక ఇతరులకు చూపించడం నిషిద్ధం.. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘిస్తే నిబంధన 49ఎం (ఓటు రహస్యం) బహిర్గతం నియమం మేరకు ఎన్నికల అధికారులు గుర్తించి ఓటరును బయటకు పంపిస్తారు. ఆ ఓటును నిబంధన 17ఏలో నమోదు చేస్తారు. లెక్కింపు సమయంలో ఆ ఓటును పరిగణనలోకి తీసుకోరు. నిబంధన 49ఎం ప్రకారం అంధులైన ఓటర్లు తమ ఓటు వేయడానికి 18 సంవత్సరాలు దాటిన సహాయకుడిని వెంట తీసుకెళ్లవచ్చు. సహాయకుడు అతని ఓటును బహిర్గతపర్చనని నిబంధన 10లో ధృవీకరించాల్సి ఉంది.

విభజించి..వదిలేశారు..

- ఎక్కడి సమస్యలక్కడే!?.. పుట్టుకొస్తున్న కొత్త సమస్యలు
- నేటితో కొత్త జిల్లాలు ఏర్పడి రెండేళ్లు పూర్తి
- ఇంకా పూర్తికాని పలు శాఖల విభజన
- కలెక్టరేట్ భవనాలకు కూడా పడని పునాది
- అద్దె ఇళ్లల్లో అధికారులు..శాఖల వారీగా అవస్థలు

తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాలు ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. కానీ జిల్లాల వారీ కొన్ని శాఖల విభజన కూడా ఇంకా పూర్తికాలేదు. గురువారం నాటికి రెండేళ్లు పూర్తయినా ఇంకా చాలా సమస్యలు పరిష్కారం కాకుండానే ఉండిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలుగా విభజించిన సంగతి తెలిసిందే. ఎంతో అట్టహాసంగా పరిపాలన ప్రజల దగ్గర వరకూ తెచ్చేస్తున్నట్టు వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుని జిల్లాల విభజన చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కేంద్రంగా ఉండేది. అక్కడ కలెక్టరేట్ ఉండేది. అందువల్ల కొత్త కాకినాడ జిల్లాకు కలెక్టరేట్ సమస్య లేదు. కానీ కొత్తగా అమలాపురం కేంద్రంగా ఏర్పడిన డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలకు కొత్త కలెక్టరేట్లు నిర్మించలేదు. రాజమహేంద్రవరంలో నేక్ భవనంలో కలెక్టరేట్ నడుస్తోంది. గిరిజన యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను ఎత్తేసి అక్కడ కొత్త జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేశారు. కొత్తలో కలెక్టరేట్ నిర్మాణానికి స్థలాలు పరిశీలించినట్టు చెప్పారు. కానీ ఇంత వరకూ అవి ఎక్కడనేది ఖరారు చేయలేదు. పనులూ లేవు. మరో జిల్లా అధికార కార్యాలయాలు కూడా పూర్తిగా లేవు. కలెక్టర్ డా. కె.మాధవీలత గతంలో ఆర్డీవోలు, సబ్-కలెక్టర్లు నివాసంగా వాడుకున్న క్వార్టర్‌నే క్యాంప్ ఆఫీసుగా మార్చుకున్నారు. అక్కడే నివాసం ఉంటున్నారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు క్వార్టర్లు లేక అద్దె భవనాల్లో ఉంటున్నారు. ఇంకా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్ డబ్ల్యూఎస్ శాఖల విభజన పూర్తి కాలేదు. వీరికి జిల్లా ఇంజనీరింగ్ అధికారులుగా డిజిగ్నేషన్ ఇచ్చినప్పటికీ అధికారాలు బదిలీ కాలేదు. ఈ శాఖల్లో అధికారులు జిల్లా స్థాయి అధికారులుగా ఉన్నప్పటికీ పనుల కోసం కాకినాడలోని ఎస్ఈలను, కొవ్వూరు డివిజన్ కూడా తూర్పుగోదావరి జిల్లాకి వచ్చింది కాబట్టి అక్కడ పనుల కోసం ఏలూరు ఎస్ఈలను సంప్రదించాల్సి వస్తుంది. జీతాలు కూడా రాజమహేంద్రవరం డివిజన్, రంపచోడవరం డివిజన్ ఇంజనీరింగ్ అధికారులకు ఈ శాఖల అధికారులు ఇక్కడే జీతాలు ఇస్తారు. కొవ్వూరు డివిజన్‌లోని అధికారులు భీమవరం కేంద్రంగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లా అధికారులు డీడీవోలుగా ఉంటారు. పనులు ఒకచోట, జీతాలు ప్రతిపాదించేది మరొక చోట పెద్దసమస్యగా మారింది. ఏజెన్సీ ప్రాంతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోకి వెళ్లినా ఇంకా లింక్ ఇక్కడే ఉంది. ఎక్సైజ్ విభజన కూడా పూర్తి కాలేదు. ట్రాన్స్‌కోకు ఇంకా రాజమహేంద్రవరమే కేంద్రం. బీసీ, ఎస్సీ కార్పొరేషన్లకు ఇంకా కాకినాడ కేంద్రంగానే నడుస్తున్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ డీఆర్డీవో భవనంలో ఉండగా, ఇతర కార్యాలయాలు కాలేజీల్లో నడుస్తున్నాయి. సొంత భవనాలు ఊసే లేదు. అధికారుల బదిలీలు, ఇతర అంశాలు కూడా ఇంకా కొన్ని ఉమ్మడిగా ఉండడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లు ఉన్న సంగతి తెలిసిందే. అక్కడి పోలీసుల నుంచి ఇతర అధికారులంతా అంతా ఏలూరు కేంద్రం అనుమతితోనే బదిలీలు ఉన్నాయి. ఇతర శాఖల పరిస్థితి అంతే. జిల్లాలు పూర్తి స్థాయిలో విభజన జరిగి, కొత్త జిల్లా అధికారులకు పూర్తి స్థాయి అధికారాలు ఉంటేనే మేలుగా ఉంటుంది. కానీ జిల్లాలను హడావిడిగా విభజించిన వైసీపీ ప్రభుత్వం తర్వాత వాటిని పెద్దగా పట్టించుకోకపోవడం గమనార్హం.

గ్రామస్థుల దాడిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



కొవ్వూరు, ఏప్రిల్ 3: అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిపై భయంతో గ్రామస్థులు దాడి చేయడంతో మృతి చెందాడు. కొవ్వూరు మండలం సీతంపేటలో ఈ దారుణం జరిగింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం మండలంలోని సీతంపేట గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నిక్కరు ధరించి గ్రామంలో ఒక ఇంటిముందు తిరుగుతున్నాడు. ఇటీవల సోషల్ మీడియాలో రాత్రి సమయంలో ఇంటిపై దాడిచేసి దొంగతనాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌కు సంబంధించిన వ్యక్తి అనుకుని ఆ ఇంటిలోని మహిళ ఆకుల నర్సవేణి పెద్ద పెద్ద కేకలు వేసింది. దీంతో గ్రామస్థులు గుమిగూడి ఆ వ్యక్తిపై మూకుమ్మడి దాడి చేశారు. అపస్మారకస్థితిలో కిందపడిపోయిన వ్యక్తిని వదిలిపెట్టి గ్రామస్థులు ఎవరికి వారు వెళ్లిపోయారు. ఉదయం చూసేసరికి అక్కడేపడి ఉన్న వ్యక్తిని చూసి స్థానికులు కొవ్వూరు రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.సుధాకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వ్యక్తిని పరిశీలించగా మృతి చెందాడని ధ్రువీకరించారు. దాడి చేసిన వారిని గుర్తించి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. చనిపోయిన వ్యక్తికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదని, ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు రూరల్ ఎస్ఐ 9440796623, సీఐ 9440796621కు సమాచారం అందించాలన్నారు. మద్దూరులంక వీఆర్వో జి.వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహనకు ర్యాలీ



రంపచోడవరం, ఏప్రిల్ 3: ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తహశీల్దారు ఎ.కృష్ణ జ్యోతి అన్నారు. మహిళా సంఘాలు, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో బుధవారం రంపచోడవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేసేలా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. తహశీల్దారు కార్యాలయం నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. స్థానిక జూనియర్ కళాశాల ఎదురుగా విభూది బ్రదర్స్ కళానాటకం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో డీఎస్‌వీ రమణ, ఎంపీడీవో హరికృష్ణ, ఎస్ఐ మోహన్‌రావు, టీడీలు ఎన్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు సూరమ్మ, ఇందిరాబామ్, వీఆర్వోలు గణపతి, సీహెచ్ రవి, రమాదేవి, జి.ప్రభాకర్, జి.భూషణం, సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి సీహెచ్ సుధా ప్రకాష్ పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.2.12 లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 3: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,12,740 లభించినట్టు ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

మౌలిక సదుపాయాల కల్పనకు నివేదికలు సిద్ధం చేయాలి


పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం, ఏప్రిల్ 3: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు నివేదికలు సమర్పించాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. తన కార్యాలయ చాంబరులో బుధవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ వెనుకబడిన కొండరెడ్ల కులస్థులకు విద్యుత్, రహదారులు, తాగునీరు సౌకర్యం, పక్కా గృహాలు ఏర్పాటు తదితర అంశాలతో కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. ఏడు మండలాల్లో గృహాల నిర్మాణానికి లబ్ధిదారుల ఎంపిక, మంజూరైన గృహాలు, ప్రారంభించిన గృహాల పనులకు సంబంధించిన నివేదికలు సమర్పించాలని, ఏజెన్సీలో భవనాలు లేని పాఠశాలలు గుర్తించి నివేదికలు అందజేయాలని డీఈవోను ఆదేశించారు. అలాగే ప్రతి పీహెచ్‌సీలో బర్త్ వెయిటింగ్ హాలు, విలేజ్ క్లినిక్ ఏర్పాటుకు నివేదికలు సమర్పించాలని ఏడీఎంహెచ్‌వోను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో (జీ) సీహెచ్ శ్రీనివాసరావు, డీడీ కె.అబుసలాం, ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, డీఈవో మల్లేశ్వరరావు, డివిజనల్ సివిల్ సప్లయి అధికారి సి.శ్రీహరి, ఈఈలు జి.డేవిడ్‌రాజ్, ఎండీ యూసఫ్, ఎ.రవికుమార్, సీడీపీవో సంధ్యారాణి, డీఈలు సాయిసతీష్, రాజేంద్రబాబు, శ్రీనివాసరావు, ఎస్‌వో టి.మార్తమ్మ, జీసీసీ ఎస్ఎం ఎం.నాగవెంకటరాజారెడ్డి పాల్గొన్నారు.

‘అభ్యర్థిని మార్చకుంటే రాజీనామాలే’

అడ్డతీగల, ఏప్రిల్ 3: రంపచోడవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిని మార్చకుంటే మూకుమ్మడి రాజీనామాలు చేయాల్సి వస్తుందని పలువురు నాయకులు అన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ అన్నం సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సీనియర్ నాయకులు, గ్రామ కమిటీ కన్వీనర్స్, బూత్ కమిటీ కన్వీనర్స్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు అడ్డతీగలలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎంతో మంది సీనియర్లను కాదని కనీస సమాచారం ఇవ్వకుండా కొత్తవారికి సీటు కేటాయించడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధిష్ఠానం తన వైఖరి మార్చుకోకుంటే మూకుమ్మడి రాజీనామాలు తప్పవని సూచించారు. సీనియర్‌లలో ఎవరికైనా సీటు కేటాయిస్తే కలిసి కట్టుగా పనిచేసి అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామన్నారు.

‘సీనియర్లను అవమానిస్తున్నారు..’

దేవీపట్నం ,ఏప్రిల్ 3: రంపచోడవరం టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీష టీడీపీ సీనియర్ నాయకులను అవమానపరుస్తున్నారని, పార్టీ కేడర్‌ను పట్టించుకోవడంలేదని టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకూరుపేటలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ముచ్చు త్రిమూర్తులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. శిరీషకు ఎదురుగాలి వీస్తుందని టీడీపీ క్యాడర్‌ను కలుపుకోకుండా పయనిస్తుందన్నారు. పార్టీ సీనియర్లు లేకుండా చిన్న మీటింగ్‌లు పెట్టి అవి పెద్దగా చూపించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. అధిష్ఠానం పునరాలోచించి వంతల రాజేశ్వరికే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంజ్యం సత్యనగేష్, మాగాపు బాబూరావు, గొళ్ళ చంటిబాబు, ముచ్చు నాగేశ్వరరావు, లంక హరిబాబు, జొన్నల రాంబాబు, పెంటపాటి నాగేశ్వరరావు, గౌరీశ్వరి, పాతాళ పండు, కలుం పండు, ఇరిగాని ఏసు పాల్గొన్నారు.

ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన


గ్రామస్థులతో సమావేశమైన ఎస్ఐ శివకుమార్

మోతుగూడెం, ఏప్రిల్ 3: డొంకరాయి ఎస్ఐ శివకుమార్ వై.రామవరం మండలం బొడ్డగండి గ్రామ పంచాయతీలోని మామిడిపల్లి, బొడ్డు మామిడి గ్రామాలను సందర్శించి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు. యువత గంజాయి వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. అనంతరం బొడ్డుమామిడి యువకులకు వాలీబాల్ కిట్ అందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కల్యాణ్, కానిస్టేబుల్స్ పోసయ్య, గంగరాజు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు

వై.రామవరం,ఏప్రిల్3: వై.రామవరం మండలంలో ప్రతీ ఇంటికి పింఛన్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో కిషోర్ తెలిపారు. బుధవారం నుంచి పింఛన్లు పంపిణీ కావాల్సి ఉన్నా ఎక్కడా పంపిణీ చేయలేదు. బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేయడంలో కొంత జాప్యం ఏర్పడినట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం నుంచి సచివాలయ సిబ్బందిచే అన్ని గ్రామాల్లోను పింఛన్లు అందజేసేందుకు చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో గిరిజన గ్రామాల్లో పింఛన్‌దారులకు ఇంటింటికి తిరిగి పింఛన్లు అందించే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. పింఛన్‌దారులు ఆందోళన చెందనవసరం లేదని ఈనెల 6లోపు మొత్తం పింఛన్ల ప్రక్రియ పూర్తిచేస్తామని ఎంపీడీవో తెలిపారు. మండలంలో 3403 మంది పింఛన్‌దారులకు రూ.1 కోటి 6లక్షల 7వేలు విడుదలైనట్లు వివరించారు.

‘రాజేశ్వరికి టికెట్ ఇవ్వకుంటే రాజీనామాలే’



రంపచోడవరం, ఏప్రిల్ 3: రంపచోడవరం టీడీపీ ఎమ్మెల్యే టికెట్ వంతల రాజేశ్వరికే ఇవ్వాలని లేకుంటే రాజీనామాలకు సిద్ధమని 11 మండలాల టీడీపీ నేతలు అన్నారు. మండలంలోని ఐ.పోలవరం గ్రామంలో నియోజకవర్గ టీడీపీ ముఖ్యనేతలు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. మిరియాల శిరీషాదేవికి టికెట్ ఇవ్వడంపై 11 మండలాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ఇప్పటికైన అధిష్ఠానం పునః పరిశీలించి వంతల రాజేశ్వరికే టికెట్ ఇవ్వాలని లేనిపక్షంలో తాము రాజీనామాలకు సిద్ధమని తెలిపారు.

హెల్త్ ఏటీఎంలను ఏర్పాటు చేస్తా

• రాజమహేంద్రవరం ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్


సిటీ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 3: ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరమే లక్ష్యంగా.. హెల్త్ ఏటీఎంలను ఏర్పాటు చేస్తామని రాజమహేంద్రవరం ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 37వ డివిజన్ బోధి స్కూల్ సమీపంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాజమహేంద్రవరం మేనిఫెస్టోను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నగర ప్రజలందరికి నచ్చే విధంగా మేనిఫెస్టోను రూపొందించామన్నారు. నగరాన్ని టూరిజం హబ్‌గా మారుస్తామన్నారు. అనంతరం 37వ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. రాజమహేంద్రవరం మహాత్మగాంధీ క్లాత్ మార్కెట్ (ఎంజీ కాంప్లెక్) వ్యాపారులకు భరోసా ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ మాట్లాడుతూ వైసీపీ రాజకీయ లబ్ధికి అవ్వాతాతలకు ఇచ్చే పింఛన్లు కావాలనే ఆలస్యం చేసి ఆనిందలను టీడీపీపై మోపడం హేయమైన చర్య అని అన్నారు. ప్రజలంతా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, తెలుగు యువత అధ్యక్షుడు ఉర్లంకల లోకేశ్,బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బుడ్డిగ గోపాలకృష్ణ, బుడ్డిగ రవి, కోసూరి చండీప్రియ, కప్పల వెలుగు కుమారి, బీజేపీ నాయకులు బొమ్ముల దత్తు, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్ పాల్గొన్నారు.

● బీసీల దశదిశ మారింది టీడీపీతోనే+అని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. బుధవారం రాత్రి సీతంపేటలోని నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డి మణి అధ్యక్షతన జరిగిన బీసీ నాయకుల సమావేశంలో మాట్లాడారు. బీసీల డీఎన్ఏలోనే టీడీపీ ఉందన్నారు. బీసీల రుణం తీర్చుకునేందుకు బీసీ డిక్లరేషన్‌ను చంద్రబాబు చేశారని గుర్తుచేశారు. అప్పటి నుంచి వైసీపీ వెన్నులో వణుకు పుట్టిందన్నారు. బీసీల్లో ఉన్న 157 కులాలకు న్యాయం చేసే బాధ్యత టీడీపీ తీసుకుంటుందన్నారు. సమావేశంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బుడ్డిగ గోపాలకృష్ణ, నగర బీసీ సెల్ అధ్యక్షుడు బుడ్డిగ రవి, శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా తదితరులు పాల్గొన్నారు.

నల్లమిల్లికి న్యాయం చేయాలంటూ బైక్ ర్యాలీ


తొస్సిపూడిలో బైక్ ర్యాలీలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి

బిక్కవోలు, ఏప్రిల్ 3: నల్లమిల్లికి న్యాయం చేయాలంటూ మండలంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. తొస్సిపూడి నుంచి పందలపాక, ఊలపల్లి మీదుగా పెదపూడి మండలం గొల్లల మామిడాడ వరకూ పది కిలోమీటర్ల మేర ఈ ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో వెయ్యి మంది తమ బైక్‌లపై ర్యాలీ నిర్వహిస్తూ అనపర్తి సీటును రామకృష్ణారెడ్డికి కేటాయించి నల్లమిల్లికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ర్యాలీ ముందు మాజీ దివంగత ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి చిత్రపటంతో రామకృష్ణారెడ్డి తనకు న్యాయం చేయాలని, టీడీపీ ఉనికి నియోజకవర్గంలో కొనసాగాలంటూ అందర్నీ అభ్యర్థించారు. ఈయన వెంట దేశం నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పడాల వెంకటరామారెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, గుణ్ణం శ్రీనివాసచౌదరి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, కర్రి శ్రీనివాసరావు, సబ్బారపు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఐకమత్యంతో అభ్యర్థుల విజయానికి కృషి చేద్దాం


మురమండలో టీడీపీ-జనసేన సమావేశం

కడియం, ఏప్రిల్ 3: రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరిల విజయానికి ఐకమత్యంగా కృషి చేద్దామని తెలుగుదేశం-జనసేన, బీజేపీ పార్టీ శ్రేణులు తెలిపారు. మురమండలో గారపాటి శ్రీను వ్యవసాయ క్షేత్రంలో బుధవారం సాయంత్రం తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన పార్టీ శ్రేణులు ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అంతా కలిసి బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల కూటమి ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరిల విజయానికి కృషిచేద్దామని తెలిపారు. ఈ సమావేశంలో దేవళ్ళ రాం బాబు, వట్టికూటి జానకిరామయ్య, షేక్ మీరా, బత్తుల గణేష్, పిల్లా వెంకట్రావు, ప్రత్తిపాటి వేంకటరామయ్యచౌదరి, గుమ్మడి నతానేలు, శేమ, ఇల్లపు హనుమంతు, సుబ్రహ్మణ్యం, పోతుల సత్యనారాయణ, ప్రత్తిపాటి వేంకటరామయ్యచౌదరి, పల్లి వెంకట్రావు, పల్లి సురేష్, కర్రా భద్రరావు, వీరభద్రుడు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో దళితులకు తీరని అన్యాయం జరిగింది

● టీడీపీ ఎస్సీసెల్ సమావేశం

కడియం, ఏప్రిల్ 3: వైసీపీ ప్రభుత్వంలో దళితులకు తీరని అన్యాయం జరిగిందని, ఆ విషయాన్ని ప్రతీ దళితవాడకు వెళ్లి తెలియజేస్తామని తెలుగుదేశం పార్టీ ఎస్సీసెల్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం కడియం టీడీపీ కార్యాలయంవద్ద దళిత నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆటోలు, ట్రాక్టర్లు, కుట్టుమిషన్లు, ఇన్నోవా కార్లు, కిరాణాషాపులు వంటి అనేక పథకాలు లభించేవన్నారు. ప్రస్తుతం జగన్ ప్రభుత్వంలో దళితులకు సబ్‌ప్లాన్ నిధులు, ఎస్సీ కార్పొరేషన్ నిధులు వంటివి లేవన్నారు. 27 పథకాలు రద్దు చేశారన్నారు. దళితవాడలలో ప్రతీ ఇంటికి వెళ్లి దళితులకు జరిగిన అన్యాయం వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు జల్లి కృపారావు, కాయల సత్యనారాయణ, కనికెళ్ళ బుల్లియ్య, విప్పర్తి శ్రీను, చింతపర్తి నాగేశ్వరరావు, శీలం రవి, ముత్తాబత్తుల విజయ, మందపల్లి రతన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.


కడియంలో టీడీపీ దళిత నాయకులు సమావేశం

పెండింగ్ సమస్యలపై స్పందించే వారికే మద్దతు

● కాలేజెస్ అండ్ స్కూల్స్ అసోసియేషన్


సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యా సంస్థల పెండింగ్ సమస్యలపై స్పందించే రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని రాజమహేంద్రి అన్ ఎయిడెడ్ కాలేజెస్ అండ్ స్కూల్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. అసోసియేషన్ నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి, పి.కళ్యాణ్ రెడ్డి, సీహెచ్ గంగాధర చౌదరి, ఎస్‌పీ గంగిరెడ్డి సురేశ్, సుంకర మురళి, నాగరత్నం, రమేశ్, భాస్కర్ మాట్లాడారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా అస్తవ్యస్తమైన విధానాలు కొనసాగుతున్నాయన్నారు.పరిపాలనాపరమైన నిర్ణయాల్లో సమన్వయం కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలాసార్లు విద్యాశాఖ ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లినా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. రాజకీయ పార్టీల అధినేతలకు తమ సంఘం తరఫున వినతి పత్రాలు అందజేస్తామన్నారు. తమ పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామంటూ మేనిఫెస్టోలో పెట్టిన వారికే మద్దతు ఇస్తామన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలకు కూడా రక్షణ చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. డిగ్రీ కళాశాలల గుర్తింపును ఐదేళ్లకు పెంచాలన్నారు. విద్యా సంస్థల వాహనాలను పలు అవసరాలకు ఇవ్వాలని యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకురాకూడదన్నారు.

సాయంత్రం వరకు పింఛన్ల కోసం నిరీక్షణ


పింఛన్లకోసం వేచి వున్న పింఛన్‌దార్లు

సీతానగరం, ఏప్రిల్ 3:వలంటీర్ వ్యవస్థ ద్వారా ఉదయాన్నే సొమ్ములు అందజేసి అధికారులు 3వ తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సాయంత్రం 4 గంటల వరకు సొమ్ములు సిబ్బందికి అందలేదు. మధ్యాహ్నం 3 గంటలకు సొమ్ములు పడ్డాయని విత్‌డ్రా చేసి పంపిణీ చేస్తామని చెప్పినా సాయంత్ర 4.30 వరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కాలేదు. అదీ కూడా పూర్తిస్థాయిలో సొమ్ములు రాలేదు అని అధికారులు చెబుతున్నారు. పింఛన్ల కోసం వృద్ధులు మండుటెండలో ఎదురుచూశారు. సీతానగరం పంచాయతీ పరిధిలోని పింఛన్ల పంపిణీలో ఒక వలంటీర్ పింఛన్ అందుకున్నారు. సొమ్ములు పడకపోవడంతో రఘుదేవపురం సచివాలయం ఏరియాలో మాత్రం సాయంత్రం 4 గంటల వరకు దండోరా కూడా వేయించలేదు.

శ్రీనివాసరావు సేవలు అభినందనీయం

దివాన్‌చెరువు, ఏప్రిల్ 3 : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధిలో ఫైనాన్స్ అధికారిగా శ్రీనివాసరావు అందించిన సేవలు అభినందనీయమని వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఫైనాన్స్ అధికారి కొత్తపూడి శ్రీనివాసరావు పదవీ విరమణ సభ బుధవారం విశ్వవిద్యాలయంలో జరిగింది. ఈసందర్భంగా ఉద్యోగ జీవితంలో ఆయన చేసిన విశేషకృషిని వివరించారు. అనంతరం శ్రీనివాసరావును ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు, సిబ్బంది శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు


శ్రీనివాసరావును సన్మానిస్తున్న వీసీ పద్మరాజు

చంద్రబాబుకు ఘన స్వాగతం

కోరుకొండ, ఏప్రిల్3: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బుధవారం మధ్యాహ్నం 3.45గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో మధురపూడి విమానాశ్రయానికి విచ్చేశారు. ఈ సందర్భగా మధురపూడి విమానాశ్రయం వద్ద చంద్రబాబుకు టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. చంద్రబాబు స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, తిరుమలకృష్ణ, మింగిలక్ష్మీనారాయణ, బుర్రి సురేష్, రొంగల శ్రీను, తెలగంశెట్టి శ్రీను, తీగల ధర్మరాజు, జనసేన నాయకుడు అడ్డాల దొరబాబు ఉన్నారు.

కమీషన్ల కోసం భూముల కొనుగోలు

● రాజానగరం ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల, టీడీపీ, జనసేన నాయకులు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 3: ఎకరానికి రూ.15లక్షలు కమీషను కోసం ఎన్నికల కోడ్ రావడానికి రెండురోజుల ముందు భూములు కొనుగోలుచేసి ఒక రోజు ముందుగా డమ్మీ పట్టాలు పంపిణీ చేశారని రాజానగరం నియోజకవర్గ జనసేన-టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ ఆరోపించారు. పాతతుంగపాడులోని మాజీ ఎంపీపీ బచ్చుప్రసాద్ స్వగృహంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అబద్ధపు, అరాచకపాలన చేస్తోందన్నారు. కోరుకొండలో ఇటీవల ప్రారంభించిన అగ్నిమాపక కేంద్రానికి కొత్త ఎక్విప్‌మెంట్ లేదని, దీంతో అక్కడి అగ్నిమాపక అధికారులు రాజమహేంద్రవరం సమాచారం ఇస్తే అక్కడినుంచి కోరుకొండ వచ్చి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారన్నారు. దీనిని బట్టి అభివృద్ధి ఎంత అబద్దమో అర్థం అవుతోందన్నారు. అలాగే పింఛన్ల పంపిణీ విషయంలో కూడా సీఎం జగన్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఖజానాలో సొమ్ములేకపోవడంతోనే పింఛన్లు పంపిణీ చేయలేక పోయారన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులను తాకట్లు పెట్టి పథకాలను అమలు చేయాలని జగన్ ఆలోచన చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగిశెట్టి చంటిబాబు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి బత్తుల గెలుపు కోసం టీడీపీ శ్రేణులన్నీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని అన్నారు. సమావేశంలో నాయకులు బుడ్డిగ అప్పారావు, తోటరామకష్ణ, పేపకాయల విష్ణుమూర్తి, బచ్చుప్రసాద్, కిమిడి శ్రీరామ్, అడపాశ్రీనివాస్, ద్వారంపూడి నాగమునేశ్వరరావు, అడ్డుమిల్లి హరికృష్ణ, కొణతం నరసింహారావు, బోయిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మునగాలలో బత్తుల కుమార్తెలు ప్రచారం

కోరుకొండ, ఏప్రిల్3: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ విజయం కోసం ఆయన కుమార్తెలు ప్రత్యూషదేవి, వందనాంబికలు కోరుకొండ మండలం మునగాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామ మాజీ సర్పంచ్ మాదబోయిన అనంతలక్ష్మి, కల్లుగీత కార్మిక కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ మాదపోయిన అప్పారావు, టీడీపీ నాయకుడు మందపాక వెంకట్రాజు, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జనసేన మండల కన్వీనర్ అడ్డాల శ్రీనివాస్, తోట సూరిబాబు, కేతా వీరబాబు, జుత్తుక రామస్వామి, నాగులపల్లి శ్రీను, ఉమ్మడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పనిచేస్తా

● అనపర్తి ఎన్డీయే కూటమి అభ్యర్థి శివరామకృష్ణంరాజు


సమావేశంలో మాట్లాడుతున్న శివరామకృష్ణంరాజు

అనపర్తి, ఏప్రిల్ 3: ఎన్డీయే కూటమిలో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నిర్ణయం మేరకు అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థిగా తనను ప్రకటించారని అధిష్ఠానం నిర్ణయం మేరకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తానని, వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పనిచేస్తామని, పొత్తులో భాగంగా టీడీపీ జనసేన పార్టీలను కలుపుకుని ముందుకు సాగుతానని అనపర్తి ఎన్డీయే అభ్యర్థి శివరామకృష్ణంరాజు అన్నారు. బుధవారం అనపర్తిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో మాజీ సైనికుడిగా సామాన్యుడైన తనను ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. త్వరలోనే ప్రణాళిక రూపొందించుకుని రెండు రోజు ల్లో ప్రచారం ప్రారంభిస్తామన్నారు. ఈనెల 6వ తేదీన రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి అధ్యక్షతన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమావేశం జరుగుతుందని సమావేశంలో అధినేత్రి సూచనల మేరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. అనపర్తి నియోజకవర్గంలో టికెట్ మార్పు అంశంపై వస్తున్న వార్తలపై ఆయనను ప్రశ్నించగా ఉమ్మడి అభ్యర్థిగా తననుప్రకటించారని తమపార్టీ చెప్పిన విధంగా చేయడమే తమ కర్తవ్యమని, నిర్ణయాధికారాలు తమ చేతుల్లో ఉండవని అధిష్ఠానం ఏమి చెబితే అది చేయడమే బీజేపీ కార్యకర్తగా తన సిద్ధాంతమని అన్నారు. బీజేపీ నాయకులు మేడపాటి హరినారాయణరెడ్డి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, వెంకటరమణ, తాడి గంగిరెడ్డి, కాకి సత్యనారాయణ, సాయిరాం, గొలుగూరి సత్యనారాయణరెడ్డి, దొరబాబు, పెదపూడి రాజు, వాగేల రాజేష్, సోడసాని ప్రసాద్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌పై ప్రతి అధికారికీ అవగాహన ఉండాలి

● అనపర్తి ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాధురి

అనపర్తి, ఏప్రిల్ 3 : వచ్చే సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటింగ్ నిర్వహణ చేపట్టిందని హోం ఓటింగ్ పేరుతో కొద్ది మంది ఓటర్లకు ప్రత్యేక అవకాశం కల్పించిందని దీని నిర్వహణలో అధికారులు అవగాహన కలిగి ఉండాలని అనపర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి మాధురి అన్నారు. బుధవారం ఆర్వో కార్యాలయంలో హోం ఓటింగ్‌పై నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ 85సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులు, 40శాతం పైబడిన దివ్యాంగులకు ఈ హోం ఓటింగ్ అవకాశం లభిస్తుందని వీరితో పారం 12 డి ద్వారా అంగీకార పత్రం తీసుకోవాలని అన్నారు. నియోజకవర్గంలో 216 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1149మంది 85 ఏళ్ళు పైబడిన వారు ఉన్నారని, 2675మంది దివ్యాంగులు హోం ఓటింగుకు అర్హులుగా ఉన్నారని వీరి నుంచి అంగీకార పత్రం తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.


ఎన్నికల అధికారులకు సూచనలిస్తున్న అనపర్తి ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి మాధురి

చంద్రబాబు సభను విజయవంతం చేయాలి

● టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 3 : చంద్రబాబు ప్రజాగళం యాత్రను విజయవంతం చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరిల ఆధ్వర్యంలో బుధవారం హెలిప్యాడ్, సభా ప్రాంగణాలను పరిశీలించారు. అనంతరం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 3గంటలకు కొవ్వూరు దొమ్మే రు రోడ్‌లో మట్టేవారి రైస్‌మిల్లు వద్ద హెలిప్యాడ్ వద్ద చంద్రబాబు ఘన స్వాగతం పలకాలన్నారు. అక్కడినుంచి మెరకవీధి, బస్టాండ్ మీదుగా విజయవిహార్ సెంటర్ వరకు బైక్‌ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకుంటారన్నారు. రాష్ట్రంలోని 175నియోజకవర్గాల్లో వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజాగళం పేరుతో చంద్రబాబు రోడ్‌షోలు నిర్వహించి ప్రజలకు వివరిస్తారన్నా రు. కొవ్వూరులో గురువారం మధ్యాహ్నం 4 గం టలకు విజయవిహార్ సెంటర్‌లో రోడ్ షో ఏర్పా టుచేస్తారన్నారు. మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద రైతులతో మాట్లాడతారన్నారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ పాల్గొన్నారు.

ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ

బిక్కవోలు, ఏప్రిల్ 3: బలభద్రపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన వినాయకుని ఆలయంలో బుధవారం స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుంగా రామారావు, వైసీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, ఆనందరెడ్డి, గంగరాజు పాల్గొన్నారు.

పీఎంపీలకు ఫస్ట్ ఎయిడ్ శిక్షణ

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 3: పీఎంపీలకు ప్రథమ చికిత్సపై శిక్షణ ఎంతో అవసరమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. కమ్యూనిటీ పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ తూర్పుగోదావరి జిల్లా సభ్యులకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. పీఎంపీ సభ్యులందరూ తప్పనిసరిగా ఈ శిక్షణ పొందాలన్నారు.డాక్టర్ పరాశర,డాక్టర్ మేఘన 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు ప్రథమ చికిత్సలో పలు అంశాలపై పీఎంపీలకు శిక్షణ ఇచ్చారు. ముందుగా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనంట్ చిత్రపటానికి పీఎంపీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కో ఆర్డినేటర్ వై.ప్రకాష్,కోశాధికారి బి.సునీల్,మేనేజింగ్ కమిటీ మెంబర్ మహాలక్ష్మి,జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు,జిల్లా కార్యదర్శి దేవానందం, నాయకులు మట్టా రమేష్, కాపా సత్యనారాయణ, డి.సాయి రామారెడ్డి పాల్గొన్నారు.

స్పాట్ కేంద్రంలో మజ్జిగ పంపిణీ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 3 : రాజమహేంద్రవరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టెన్త్ పరీక్షా పత్రాల మూల్యాంకనం స్పాట్ కేంద్రంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఉప విద్యాశాఖాధికారి నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ లక్ష్మీకుమారి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్, జిల్లా కోశాధికారి ఈవీఎస్ఎస్ఆర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శులు రమేష్‌బాబు, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.







నీ కోసమే చూస్తున్నాం : రావులపాలెం జాతీయ రహదారిపై బాబుకు సాష్టాంగ నమస్కారం చేస్తున్న అభిమాని



బండారు, సుభాష్‌తో చంద్రబాబు





నేను మీ వాడిని..

మీరు వేసే ఓటు.. మీ భవిష్యత్‌కే..

- ప్రజాగళం సభలు సూపర్‌హిట్
- అండగా ఉంటానని బాబు హామీ
- రావులపాలెంలో జగ్గిరెడ్డిపై ఫైర్
- ద్రాక్షారామలో తోట, బోస్‌పై ఆగ్రహం
- అడుగడుగునా నీరాజనం
- సభ ప్రాంగణాలకు వెల్లువలా జనం
- కూటమిలో సమరోత్సాహం
- నేడు తూర్పున పర్యటన

కాకినాడ, అమలాపురం (ఆంధ్రజ్యోతి)/ రావులపాలెం/ద్రాక్షారామ/ మండపేట/, ఏప్రిల్ 3 : జనం..జనమే జనం...అడుగడుగునా బ్రహ్మరథం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం సభకు జనం పోటెత్తారు. అధినేత ఆగమనం అలస్యం అయినా వేయి కళ్లతో ఎదురుచూశారు.. వైసీపీ పాలనలో దగాపడ్డ తమకు చంద్రబాబు అధికారంలోకి వస్తే ఏంచేస్తారో చెబితే వినడానికి బారులు తీరారు. వచ్చిన జనాలను చూస్తుంటే తెలుగుదేశం అధికారంలోకి రావడం ఖాయంగా కనిపిస్తోందని ధీమా వ్యక్తంచేశారు. గోదావరి జిల్లా ప్రజలు మంచితనానికి మారుపేరంటూ కొనియాడారు. మంచినీళ్లు అడిగితే కొబ్బరి నీళ్లు ఇచ్చేంత మంచివారు అంటూ వేనోళ్ల పొడిగారు. పూతరేకులు తీయదనం ఇక్కడి ప్రజల మనసుల్లో ఉంటుందంటూ ఈ ప్రాంతంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం, రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామలో ప్రజాగళం సభల్లో చంద్రబాబు ప్రసంగించారు. రావులపాలెంలో బుధవారం సాయంత్రం జరిగిన ప్రజాగళం తొలి బహిరంగ సభకు జనం పోటెత్తారు. చంద్రబాబు రాజమహేంద్రవరం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 4 గంటల సమయంలో మల్లయ్యదొడ్డిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకున్నారు. కూటమి శ్రేణులు చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి చంద్రబాబు సుమారు మూడు కిలోమీటర్ల రోడ్‌షో నిర్వహించారు. అక్కడ అభిమానులు ఏర్పాటు చేసిన భారీ గజమాలను క్రేన్ సాయంతో చంద్రబాబుకు అలంకరించారు.అనంతరం రావులపాలెం తెలుగుదేశం మండల పార్టీ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో మాట్లాడారు. నియోజవర్గానికి చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రణాళికలతోపాటు స్థానిక వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అవినీతిపై ఆరోపణాస్త్రాలు సంధించారు. కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రావడం తథ్యమని, చంద్రబాబు పాలన కోసం రాష్ట్రం ఎదురు చూస్తోందన్నారు. నియోజకవర్గంలోని ఓటర్లు ఈ ఎన్నికల్లో డిపాజిట్లు రాకుండా జగ్గిరెడ్డి తరిమితరిమికొట్టి ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ ఏడు అసెంబ్లీ స్థానాలను గెలిచి చంద్రబాబు కానుకగా అందిస్తానని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. చంద్రబాబునాయుడు 50 నిమిషాలకుపైగా ప్రసంగం చేశారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అవినీతి అక్రమాలపై మరోసారి చంద్రబాబు తీవ్ర స్థాయిలో ధ్వజమె త్తారు. కోనసీమ ప్రజల గొప్పదనాన్ని గుర్తుచేస్తూ ఈ ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలబడాలని పిలుపు నిచ్చారు. అన్ని స్థానాల్లో టీడీపీ, జన సేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కోనసీమ జిల్లాలో అధికార వైసీపీ అరాచ కాలపై చంద్రబాబు ధ్వజమెత్తారు. ఇసుక దోపిడీ దగ్గర నుంచి మట్టి మాఫియా వరకు ఏకరువు పెట్టారు. మంత్రి వేణు చెల్లని కాసు అని మండి పడ్డారు. తన పదవిని కాపాడుకునేందుకు వైవీ సుబ్బారెడ్డి కాళ్లపై పడి బీసీల పరువు మంటగలిపారని ధ్వజమెత్తారు. నియోజకవర్గాన్ని అడ్డంగా దోచుకుతిన్నారని నిప్పులు కక్కారు. తీరా ఎన్నికలముందు పక్క నియోజకవర్గానికి బదిలీ అయి వెళ్లిపోయారు. ఇక్కడున్న ఎంపీ బోస్‌పైనా చంద్రబాబు ధ్వజమెత్తారు.తోట త్రిమూర్తులు గురించి మాట్లాడుతూ ఇక్కడ ఉండే వ్యక్తి పక్క నియోజకవర్గానికి వెళ్లిపోయారు. దళితు లకు శిరోముండనం చేసిన వ్యక్తి ఆయన అంటూ మండిపడ్డారు. జిల్లాలో దళితులను ఎందరినో వైసీపీ పొట్టనపెట్టు కుందని చంద్రబాబు నిప్పులు కక్కారు. కాకి నాడలో తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్‌ను హత్య చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును పక్కన పెట్టుకున్న జగన్ దళితులను ఏం ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. ఆయనకు ఊరేగింపులు కూడా వైసీపీ నేతలు చేశారంటే ఎంత కండకావరం అని ప్రశ్నించారు.కోనసీమ జిల్లా అంటే బాలయోగి. ఈ ప్రాంతం కోసం ఆయన కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కోటిపల్లి నర్సాపురం రైల్వే లైన్ సాధించారు. కానీ వైసీపీ వచ్చాక కేంద్రం ఇచ్చిన నిధులకు రాష్ట్రం తన వాటా నిధులు ఇవ్వకుండా ప్రాజెక్టును నీరుగార్చింది. అందుకే బాలయోగి కల నెరవేర్చేలా టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని చంద్రబాబు ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో ఓఎన్జీసీ పైపులైను వల్ల మత్స్యకారులకు నెలకు రూ.11 వేల చెల్లింపును టీడీపీ వస్తే ఆపేస్తుందని వైసీపీ ప్రచారం చేస్తోంది. కానీ దీన్ని ఎవరూ నమ్మొద్దు..అవసరమైతే నష్టపరిహారం పెంచేలా చర్యలు చేపడతామన్నారు. గోదావరి కాలువల ఆధునికీకరణ, ఏటిగట్లు పటిష్టం చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని రహదారులను బాగుచేస్తామన్నారు. రావులపాలెంలో ప్రసంగం పూర్తి చేసుకున్న చంద్రబాబు రోడ్డుమార్గంలో జొన్నాడ, ఆలమూరు, గుమ్మిలేరు, మండపేట, మాచవరం, పసలపూడి మీదుగా రామచంద్రపురం చేరుకున్నారు. అక్కడి నుంచి భారీ రోడ్డుషో నిర్వహిస్తూ సరిగ్గా రాత్రి 9.08కి ద్రాక్షారామ చేరుకున్నారు..

నేడు చంద్రబాబు టూర్ ఇలా..

రాజమహేంద్రవరం ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబునాయుడు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో గురువారం ప్రజాగళం యాత్రలు నిర్వహించను న్నారు. టీడీపీ- జనసేన- బీజేపీ కూటమిగా ఏర్పడి అభ్యర్థులను ఖరారు చేసిన తర్వాత తొలిసారిగా జిల్లాకు వస్తు న్నారు. కొవ్వూరులో సాయంత్రం 4 గంటలకు, గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో 6 గంటల జరిగే ప్రజాగళం సభల్లో ప్రసంగిస్తారు. రాత్రికి నల్లజర్లలోని ప్రియాంక కన్వెన్షన్‌లో బస చేసి శుక్రవారం ఉదయం పార్టీ నేతలతో సమావేశమవుతారు.అనపర్తి సమస్యతోపాటు, జిల్లాలో అక్కడక్కడా ఉన్న అసంతృప్తి నేతలను బుజ్జగించే అవకాశం ఉంది. అనంతరం నరసాపురం వెళతారు.



ప్రజాగళమై : రావులపాలెం హైవేపై బాబు రోడ్‌షోకు వెల్లువెత్తిన అభిమానం





కదిలొచ్చిన పసుపు దండు : రావులపాలెంలో బహిరంగ సభకు మహిళలు

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

పింఛన్ల కోసం వృద్ధుల పాట్లు

● మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభం



పింఛన్ కోసం వచ్చి తిరిగి వెళ్లిపోతున్న వృద్ధురాలు

కొవ్వూరు, ఏప్రిల్ 3: సామాజిక పింఛన్లు పంపిణీకి సొమ్ము బ్యాంకు ఖాతాలలో బుధవారం మధ్యాహ్నం 2గంటల వరకు జమ కాలేదు. దీంతో పింఛన్ల కోసం వచ్చిన వారు నిరాశగా వెనుదిరిగారు. ఎన్నికల కోడ్ అమలుల్లోకి రావడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లను వినియోగించరాదని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీనిని ఎలాగైనా తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైసీపీ నాయకులు ప్రతిపక్షాలపై బురదచల్లాలని కుట్రలు పన్నుతున్నారు. ఇంటింటికీ పింఛన్లు పంపిణీకి సరిపడా వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో అధికారులు అలసత్వం చేస్తున్నారు. ప్రతినెల 31వ తేదీన పింఛన్ల సొమ్ము బ్యాంకులలో జమ అయ్యేది. ఏప్రిల్ నెలకు సంబంధించి 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు బ్యాంకు ఖాతాలలో సొమ్ముకాలేదు. 2 గంటల తరువాత సొమ్ము జమచేయడంతో సచివాలయ సెక్రటరీలు డ్రా చేసుకోవడానికి బ్యాంకులకు తరలివెళ్లారు. కొవ్వూరు పురపాలక సంఘంలో 4027 సామాజిక ఫించన్లు పంపిణీ చేయడానికి 67 మంది వార్డు సచివాలయ సెక్రటరీలను సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమీషనర్ కె.డానియల్ జోసఫ్ తెలిపారు.

నిడదవోలు: నిడదవోలు పట్టణంలోని సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమయ్యాయి. పింఛనుదార్లు అందరికీ పింఛన్ల పంపిణీ సంక్రమంగా జరగుతుందని అధికారులు పేర్కొన్నారు.

గోపాలపురం: ప్రభుత్వం అందజేస్తున్న యుద్ధ ప్రతిపాదికన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎంపీడీవో రమేష్ తెలిపారు. మండలంలో 9323 మందికి రూ.2కోట్ల 77లక్షల 97,500 పంపిణీ చేయాల్సి ఉందన్నారు. మొదటిరోజు 4660 మందికి 50శాతం పంపిణీ చేసినట్లు తెలిపారు.

47 మంది వలంటీర్లు రాజీనామా

గోపాలపురం/నిడదవోలు, ఏప్రిల్ 3: వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. గోపాలపురం, కోమటిగుంట గ్రామాల్లో వలంటీర్లు బుధవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు పత్రాలను ఎంపీడీవో రమేష్‌కు బుధవారం సమర్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కోమటిగుంట, గోపాలపురం గ్రామాల్లో పనిచేస్తున్న 34మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు చెప్పారు. నిడదవోలులో 13 మంది వలంటీర్లు కమిషనర్ రాం భూపాల్‌రెడ్డికి రాజీనామా పత్రాలను అందించారు. దీంతో బుధవారం ఒక్కరోజే 47 మంది రాజీనామా చేయడం గమనార్హం.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

ఉండ్రాజవరం, ఏప్రిల్ 3: తండ్రికి కుమారులు లేకపోవడంతో కుమార్తె తలకొరివి పెట్టిన సంఘటన మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో బుధవారం చోటుచేసుకుంది. ఉండ్రాజవరంలో చేనేత సామాజిక వర్గానికి చెందిన రేగు శ్రీనివాస్(40) అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు లేడు. రెండో కుమార్తె దుర్గ తండ్రికి తలకొరివిపెట్టి కొడుకులేని లోటు తీర్చింది. కుమార్తెలు అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయాలి

● టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 3 : చంద్రబాబు ప్రజాగళం యాత్రను విజయవంతం చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరిల ఆధ్వర్యంలో బుధవారం హెలిప్యాడ్, సభా ప్రాంగణాలను పరిశీలించారు. అనంతరం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 3గంటలకు కొవ్వూరు దొమ్మేరు రోడ్‌లో మట్టేవారి రైస్‌మిల్లు వద్ద హెలిప్యాడ్ వద్ద చంద్రబాబు ఘన స్వాగతం పలకాలన్నారు. అక్కడినుంచి మెరకవీధి, బస్టాండ్ మీదుగా విజయవిహార్ సెంటర్ వరకు బైక్‌ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకుంటారన్నారు. రాష్ట్రంలోని 175నియోజకవర్గాల్లో వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజాగళం పేరుతో చంద్రబాబు రోడ్‌షోలు నిర్వహించి ప్రజలకు వివరిస్తారన్నారు. కొవ్వూరులో గురువారం మధ్యాహ్నం 4 గంటలకు విజయవిహార్ సెంటర్‌లో రోడ్ షో ఏర్పాటుచేస్తారన్నారు. మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద రైతులతో మాట్లాడతారన్నారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ పాల్గొన్నారు.

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో శుక్రవారం సాయంత్రం చంద్రబాబు ప్రజాగళం సభను విజయవంతం చేయాలని గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు అన్నారు. దేవరపల్లిలో బుధవారం జరిగిన విలేఖర్ల సమావేశంలో సువర్ణరాజు మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గ నుంచి ప్రజాగళం సభకు జనసేన, టీడీపీ, బీజేపీ, నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. జనసేన నేతలు చప్పటి శివ నాగప్రసాద్, మణికంఠ, శ్రీనివాస్, నాని పాల్గొన్నారు.

సంతాన గోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ



నల్లజర్ల, ఏప్రిల్ 3 : నల్లజర్ల మండలం కవులూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సంతాన గోపాలస్వామి(కృష్ణుడు)ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. గత మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, బిందెలతో అభిషేకాలు, శోభాయత్రా, నృత్యగానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు శ్రీ సుదర్శనం రామ దుర్గా కుమారాచ్యారు(దుర్గాబాబు), సుదర్శనం వెంకట సత్య శ్రీనివాస్, పురోహితులు డీఎల్ఎన్‌వీ నరసింహమూర్తి పూజ కార్యక్రమాలు జరిగాయి. గద్దె భద్ర, అనంతలక్ష్మి దంపతులు, ఆలపాటి సూర్యారావు, వరలక్ష్మి దంపతులతోపాటు 6గురు దంపతులు పూజాధికాలు నిర్వహించారు. భీమవరం ఇస్కాన్ సంస్థ సభ్యులు గాన కచేరి నిర్వహించారు. గ్రామస్తులు శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో 3వేల మందికి అన్నాసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఉబ్బిసెట్టి శ్రీనివాస్, వీరమల్ల గంగరాజు, సీహెచ్ చిన్న పుల్లయ్య, సర్పంచ్ మద్దిపాటి శ్రీను, గగ్గర శ్రీను పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిపై గ్రామస్థుల దాడి

● దాడిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కొవ్వూరు, ఏప్రిల్ 3: అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిపై భయంతో గ్రామస్థులు దాడిచేయడంతో మృతి చెందిన సంఘటన కొవ్వూరు మండలం సీతంపేటలో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం మండలంలోని సీతంపేట గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి 1-30గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నిక్కరు ధరించి గ్రామంలో ఒక ఇంటిముందు తిరుగుతున్నాడు. ఇటీవల సోషల్ మీడియాలో రాత్రి సమయంలో ఇంటిపై దాడి చేసి దొంగతనాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌కు సంబంధించిన వ్యక్తి అనుకుని ఆ ఇంటిలోని మహిళ ఆకుల నర్సవేణి కేకలు వేసింది. దీంతో గ్రామస్థులు గుమిగూడి ఆ వ్యక్తిపై మూకుమ్మడి దాడి చేశారు. అపస్మారకస్థితిలో కిందపడిపోయిన వ్యక్తిని వదిలిపెట్టి గ్రామస్థులు ఎవరికి వారు వెళ్లిపోయారు. ఉదయం చూసేసరికి అక్కడే



పడి ఉన్న వ్యక్తిని చూసి స్థానికులు కొవ్వూరు రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ కె.సుధాకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వ్యక్తిని పరిశీలించగా మృతి చెందాడని ధ్రువీకరించారు. దాడి చేసిన వారిని గుర్తించి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతునికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదని, ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ 944079 6623, సీఐ 9440796621కు సమాచారం అందించాలన్నారు. మద్దూరు లంక వీఆర్వో జి.వెంకటేశ్వరరావు ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కొవ్వూరురూరల్ ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపారు.

కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యాగంటి చలపతి

కొవ్వూరు, ఏప్రిల్ 3 : కొవ్వూరు 9వ అదనపు జిల్లా కోర్టు శాశ్వత భవన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా యాగంటి చలపతి అన్నారు. బుధవారం కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బొబ్బా భారతి ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం నిర్వహించారు.

